# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మానవాళి సంక్షేమానికి అవసరమైన సందేశాన్ని 'విశ్వ ఆధ్యాత్మిక మహోత్సవం' అందిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.**
2. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న తెలంగాణలోని మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో పర్యటించారు.**
3. **కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనుంది.**
4. **తెలంగాణాలో ప్రకృతి పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
5. **ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్-ఏపీపీఎస్సీ రేపు రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనుంది.**
6. **అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

అంతర్గత శాంతి నుంచి ప్రపంచశాంతి వరకు.. మానవాళి సంక్షేమానికి అవసరమైన సందేశాన్ని 'విశ్వ ఆధ్యాత్మిక మహోత్సవం' అందిస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. వసుధైక కుటుంబ భావనను విశ్వవ్యాప్తం చేయడంతో పాటు మత సామరస్యాన్ని, పరస్పర అవగాహనను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణాలోని రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హశాంతివనంలో ఏర్పాటుచేసిన విశ్వ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఆమె నిన్న పాల్గొని ప్రసంగించారు. ఆధ్యాత్మికతపై ఆధారపడిన మన సంస్కృతి 'వసుధైక కుటుంబం' అనే భావనను విశ్వవ్యాప్తం చేస్తుందని అన్నారు. పూర్వీకుల వారసత్వంగా వచ్చిన నైతిక ఆదర్శాలు, ఆధ్యాత్మిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న తెలంగాణలో పర్యటించారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఓపెన్‌టాప్ వాహనంలో ఆయన నిర్వహించిన రోడ్ షోకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన వాయిద్య బృందాల ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఆయన వెంట కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ ఉన్నారు. రోడ్‌షో అనంతరం ప్రధానమంత్రి రాజ్‌భవన్‌కు చేరుకొని రాత్రి అక్కడ బస చేశారు.

తెలంగాణలోని నాగర్‌కర్నూల్ లో ప్రధానమంత్రి ఈరోజు పర్యటిస్తారు. అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం కర్ణాటకలోని గుల్బర్గాకు వెళతారు. కాగా, నిన్న కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ప్రధానమంత్రి పర్యటించారు.

---------------------------

కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఏకకాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈరోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల సంఘం అధికారికంగా వెల్లడించనుంది.

---------------------------

తెలంగాణాలో ప్రకృతి పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అటవీ, పర్యాటకశాఖలు కలిసి పనిచేయాలని సూచించారు. వన్యప్రాణులకు హాని కలగకుండా కొత్తగా ప్రకృతి పర్యాటక విధానాన్ని తీసుకురావాలని అన్నారు. అటవీశాఖతో పాటు, ఇతర శాఖల్లో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తించిన వారిని బదిలీ చేసేలా మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అటవీశాఖ అధికారులతో ఆయన నిన్న హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఉత్తర తెలంగాణలో కవ్వాల్, దక్షిణ తెలంగాణ వైపు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్-ఏపీపీఎస్సీ రేపు రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనుంది. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఫొటో ఉన్న ఏదైనా ఒరిజనల్ గుర్తింపు కార్డును తప్పకుండా తమతో తీసుకురావాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటలకే చేరుకోవాలి. ఉదయం 9 గంటల 45 నిమిషాల తరువాత, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంటా 45 నిమిషాల తరువాత వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షల ఏర్పాట్లపై రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల కలెక్టర్లు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు నిన్న అధికారులను ఆదేశించారు.

---------------------------

అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.. భాషా ప్రయుక్త రాష్ట్ర సిద్ధాంతానికి రూపురేఖలు దిద్ది.. ఆంధ్ర రాష్ట్రం సాధించుకోవడంలో కీలక భూమిక పోషించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు... ఆయన 1901 మార్చి 16న అప్పటి మద్రాసు రాష్ట్రంలో జన్మించారు. 1930లో గాంధీజీతో కలిసి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆయన జైలుశిక్ష అనుభవించారు. 1941-42 సంవత్సరాల్లో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని..మూడుసార్లు జైలుకు వెళ్ళారు. 1952 అక్టోబర్ 10 నుంచి 58 రోజులపాటు ఆంధ్రరాష్ట్రం కోసం ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. డిసెంబర్ 15న ఆయన అసువులు బాసి అమరజీవి అయ్యారు.

---------------------------

తెలంగాణాలో ఈరోజు జరగనున్న ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో భాగంగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ -2 పరీక్షకు సెట్-ఎ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేసినట్లు తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణికి తెలియజేశారు.

---------------------------

పేదలపై భారం పడకుండా ప్రత్యామ్నాయ వనరుల ద్వారా తెలంగాణ రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం ఉన్నతాధికారులను ఆదేశించింది. 'రాష్ట్ర ఆదాయం పెంచుకోవడం – వనరుల నిర్వహణ' అనే అంశంపై హైదరాబాద్‌లో నిన్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. రాష్ట్ర ఆదాయం పెంచేందుకు ప్రతివారం సమీక్ష నిర్వహించాలని.. సమావేశంలో చర్చించిన ప్రగతిని మరుసటి వారం నివేదించాలని ఆదేశించారు. హైదరాబాద్ పరిసరాల్లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయాలని భట్టివిక్రమార్క పేర్కొన్నారు.

---------------------------

భారత్ -పాక్ యుద్ధ వీరుడు, భారతదేశ పూర్వ నౌకాదళాధిపతి, రామన్ మెగసెసే, వీర్‌చక్ర పురస్కార గ్రహీత.. అడ్మిరల్ లక్ష్మీనారాయణ్ రాందాస్ మరణించారు. ఆయన వయస్సు 90 సంవత్సరాలు గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. నిన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ ఆస్పత్రిలో మృతిచెందారు.

---------------------------

త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బ్యాంకు ఖాతాల ద్వారా అధిక మొత్తంలో జరిగే, అనుమానాస్పద లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు ఆదాయపు పన్ను శాఖకు, ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా బ్యాంకర్లను ఆదేశించారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అమలుకు సంబంధించి రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాన్ని నిన్న రాష్ట్ర సచివాలయంలో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఏడాది అక్టోబరు 1 నుంచి రోజుకు 10 లక్షల రూపాయలకు మించి.. గత 30 రోజుల కాలవ్యవధిలో 50 లక్షల రూపాయలకు మించి లావాదేవీలు జరిగిన బ్యాంకు ఖాతాల వివరాలను సమర్పించాలని అన్ని బ్యాంకుల నోడల్ అధికారులను ఆయన కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల్లో పోటీచేసే ప్రతి లోక్‌సభ అభ్యర్థి 95 లక్షల రూపాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి 40 లక్షల రూపాయల వరకే వ్యయం చేసేందుకు అనుమతి ఉందన్నారు. అంతకుమించి జరిగే వ్యయంపై పటిష్టమైన నిఘా ఉంటుందని తెలిపారు.

---------------------------

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు కరువు భత్యాలు-డీఏలు మంజూరు చేసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ నిన్న ఈ ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన కరువుభత్యం 3.64 శాతం, అలాగే గతేడాది జూలై 1 నుంచి ఇవ్వాల్సిన కరువుభత్యం 3.64 శాతంలను మంజూరు చేశారు. గతేడాది జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన కరువుభత్యంను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలతో కలిపి చెల్లించనున్నారు. అలాగే గతేడాది జూలై 1 నుంచి ఇవ్వాల్సిన కరువుభత్యంను ఈ

ఏడాది జూలై నుంచి వేతనాలతో కలిపి  చెల్లిస్తారు. డీఏ బకాయిలను సమాన వాయిదాల్లో జనరల్ ప్రావిడెంట్ ఫండ్–జీపీఎఫ్‌కు జమ చేయనున్నారు.

---------------------------

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ..టిఎస్ఆర్టీసీ... రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సిబ్బంది సంక్షేమం, సాంకేతికత వినియోగం, తదితర కేటగిరిల్లో ఐదు జాతీయ పురస్కారాలను దక్కించుకుంది. దిల్లీలో నిన్న జరిగిన నేషనల్ పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డులను ఆర్టీసీ ఎండీ వీసీ. సజ్జనార్ నేతృత్వంలోని అధికారుల బృందం అందుకుంది. ఐదు జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవడం  సంస్థకు ఎంతో గర్వకారణమని, ఉద్యోగులకు ఈ పురస్కారాలను అంకితం చేస్తున్నట్లు సజ్జనార్ ప్రకటించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర హోం మంత్రి  తానేటి వనిత తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలను, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ను నిన్న ఆమె ప్రారంభించారు.

=======================